


నేటి మ్యాచ్
భారత్
X
అఫ్ఘానిస్థాన్
మ. 2.00 నుంచి
వేదిక: ఢిల్లీ

# సాత్విక్-చిరాగ్ @1

న్యూఢిల్లీ: ఇటీవల ముగిసిన ఆసియా క్రీడల్లో పసడి పతకంతో మెరిసిన భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి చరిత్ర సృష్టించింది. పురుషుల డబుల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ కైవసం చేసుకుంది. బీడబ్ల్యూఎఫ్ మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో ఈ జంట అగ్రస్థానం చేజిక్కించుకుంది. మన దేశం నుంచి గతంలో ప్రకాశ్ పదుకోన్, సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ టాప్ ర్యాంక్‌లో నిలువగా.. ఇప్పుడు వారి సరసన సాత్విక్-చిరాగ్ చేరారు. బర్మింగ్‌హామ్ కామన్వెల్త్‌లో స్వర్ణం గెలువడంతో పాటు.. మన దేశం తరపున తొలి సూపర్-1000 టైటిల్ నెగ్గిన సాత్విక్-చిరాక్ ద్వయం కొత్త అధ్యాయం లిఖించింది. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ 8వ ర్యాంక్ సొంతం చేసుకోగా.. మహిళల సింగిల్స్‌లో రెండు స్థానాలు మెరుగు పరుచుకున్న పీవీ సింధు 13వ ర్యాంక్‌లో నిలిచింది.



**4** బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానానికి చేరిన నాలుగో భారతీయులుగా సాత్విక్-చిరాగ్ రికార్డుల్లోకెక్కారు. గతంలో ప్రకాశ్ పదుకోన్, సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ ఈ ఘనత సాధించారు.

శ్రీలంకపై ప్రతీకార గెలుపు

# పాక్ పరాక్రమం

**రిజ్వాన్, షఫీక్ శతక విజృంభణ • మెండిస్, సమరవిక్రమ సెంచరీలు వృథా • ఉప్పల్‌లో పరుగుల వరద • శ్రీలంక 344/9, పాకిస్థాన్ 345/4**

**ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌లో మరో భారీ స్కోరింగ్ మ్యాచ్. ఉప్పల్ స్టేడియం వేదికగా పరుగుల వరద. సెంచరీల మోతతో హోరెత్తిన హైదరాబాద్‌లో శ్రీలంకపై పాకిస్థాన్ పరాక్రమం చూపెట్టింది. ఆసియాకప్‌లో తమకు ఎదురైన పరాజయానికి ప్రపంచకప్‌లో కసితీరా ప్రతీకారం తీర్చుకుంది. తాము మనసు పెట్టి ఆడితే ప్రత్యర్థి బలాదూర్ అన్న రీతిలో సమిష్టి ప్రదర్శనతో కదంతొక్కింది. రిజ్వాన్, షఫీక్ సూపర్ సెంచరీలతో పాక్ ఘన విజయం సొంతం చేసుకుంది. తొలుత కుశాల్ మెండిస్, సమరవిక్రమ సెంచరీలతో భారీ స్కోరు అందుకున్న లంక.. మరోమారు బౌలింగ్‌లో ధారాళంగా పరుగులు సమర్పించుకుని రెండో ఓటమిని ఖాతాలో వేసుకుంది.**

(నమస్తే తెలంగాణ, ఆట ప్రతినిధి)

వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్ గెలుపు జోరు కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పాక్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. లంక నిర్దేశించిన 345 పరుగుల లక్ష్యఛేదనలో పాక్.. 48.2 ఓవర్లలో 345/4 స్కోరు చేసింది. రిజ్వాన్ (121 బంతుల్లో 131నాటౌట్, 8 ఫోర్లు, 3 సిక్సలు), షఫీక్ (103 బంతుల్లో 113, 10 ఫోర్లు, 3 సిక్సలు) సెంచరీలతో కదంతొక్కారు. మదుశనక (2/60) రెండు వికెట్లు తీశాడు. అంతకుముందు లంక 50 ఓవర్లో 344/9 స్కోరు చేసింది. కుశాల్ మెండిస్ (122, 14 ఫోర్లు, 6 సిక్సలు), సమరవిక్రమ (108, 11 ఫోర్లు, 2 సిక్సలు) శతకాలతో విజృంభించారు. హసన్ అలీ(4-71) నాలుగు వికెట్లతో రాణించాడు. రిజ్వాన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ప్రపంచకప్‌లో శ్రీలంకపై అపజయమెరుగని పాక్ ఆ రికార్డును మరోమారు కొనసాగించింది.

**షఫీక్ సూపర్:**
లంక నిర్దేశించిన 345 పరుగుల లక్ష్యఛేదనలో పాక్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఫామ్ లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓపెనర్ ఇమాముల్ హక్ (12) మరోమారు నిరాశపరిచాడు. మదుశనక బౌలింగ్‌లో పెరెరాకు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. కెప్టెన్ బాబర్ ఆజమ్ (10) కూడా ఇమాముల్‌ను అనుసరించాడు. మదుశనకకే వికెట్ సమర్పించుకుని ఉసూరుమనిపించాడు. దీంతో 37 పరుగులకే పాక్ రెండు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఈ తరుణంలో ఫకర్ జమాన్ స్థానంలో తుది జట్టులోకి వచ్చిన అబ్దుల్లా షఫీక్..మహమ్మద్ రిజ్వాన్ ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశారు. వీరిద్దరు లంక బౌలింగ్ దాడిని సమర్థంగా నిలువరిస్తూ పరుగులు కొల్లగొట్టడంతో తొలి పవర్‌ప్లే ముగిసే సరికి రెండు వికెట్ల నష్టానికి 48 పరుగులు చేసింది. రిజ్వాన్‌తో కలిసి దూకుడు కనబరిచిన షఫీక్..58 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని విడగొట్టేందుకు లంక కెప్టెన్ షనక ఎన్ని రకాలుగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. బౌలర్లను మార్చిమార్చినా ప్రయోగించినా..ఫలితం రాబట్టలేకపోయాడు. పతిరన బౌలింగ్‌లో ఫోర్‌తో రిజ్వాన్ అర్ధసెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. మరో ఎండ్‌లో ఇదే అదనుగా బౌండరీలతో విరుచుకుపడ్డ షఫీక్.. బౌండరీతో సెంచరీ మార్క్ అందుకుని సంబురాల్లో మునిగిపోయాడు. వన్డేల్లో షఫీక్‌కు ఇది తొలి సెంచరీ కావడం విశేషం. సాఫీగా సాగుతున్న ఇన్నింగ్స్‌ను పతిరన దెబ్బతీశాడు. ఇన్నింగ్స్ 34వ ఓవర్ తొలి బంతికే..సబ్‌స్టిట్యూట్ హేమంత సూపర్ క్యాచ్‌తో షఫీక్ పెవిలియన్ చేరడంతో మూడో వికెట్‌కు 176 పరుగుల భాగస్వామ్యానికి ముగింపు పడింది. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన సౌద్ షకీల్(31)..రిజ్వాన్‌కు జత కలిశాడు. ఈ క్రమంలో రిజ్వాన్‌కు కండరాలు పట్టేసినా..పంటి బిగువునా భరిస్తూ పరుగులు సాధించాడు. 97 బంతుల్లో రిజ్వాన్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. 45వ ఓవర్‌లో షకీల్‌ను తీక్షణ పెవిలియన్ పంపినా.. మిగిలిన పనిని ఇఫ్తికార్(22)తో కలిసి రిజ్వాన్ పూర్తి చేశాడు.


రిజ్వాన్ (131*)

షఫీక్ (113)

**ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక**

| దే | ఆ | గె | ఓ | ర.రే. | పా |
|---|---|---|---|---|---|
| న్యూజిలాండ్ | 2 | 2 | 0 | +1.95 | 4 |
| పాకిస్థాన్ | 2 | 2 | 0 | +0.92 | 4 |
| దక్షిణాఫ్రికా | 1 | 1 | 0 | +2.04 | 2 |
| భారత్ | 1 | 1 | 0 | +0.88 | 2 |
| ఇంగ్లండ్ | 2 | 1 | 1 | +0.55 | 2 |
| బంగ్లాదేశ్ | 2 | 1 | 1 | -0.65 | 2 |
| ఆస్ట్రేలియా | 1 | 0 | 1 | -0.88 | 0 |
| శ్రీలంక | 2 | 0 | 2 | -1.16 | 0 |
| అఫ్గానిస్థాన్ | 1 | 0 | 1 | -1.43 | 0 |
| నెదర్లాండ్స్ | 2 | 0 | 2 | -1.80 | 0 |

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్


ఈ మ్యాచ్‌కు **24,181** మంది హాజరయ్యారు

**2** ఉప్పల్ స్టేడియంలో సెంచరీ చేసిన రెండో శ్రీలంక బ్యాటర్‌గా కుశాల్ మెండిస్ నిలిచాడు. ఇంతకుముందు హైదరాబాద్‌లో మహేలా జయవర్దనే సెంచరీ కొట్టాడు.

**1** వన్డే ప్రపంచకప్ చరిత్రలో పాకిస్థాన్ తొలిసారి ప్రత్యర్థికి అత్యధిక పరుగులు (344) సమర్పించుకున్నది. గత (2019) ప్రపంచకప్‌లో పాక్‌పై భారత్ 336 పరుగులు చేయడం ఇప్పటి వరకు అత్యధికం

**1** వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక తరపున వేగవంతమైన సెంచరీ (65 బంతుల్లో) చేసిన ప్లేయర్‌గా కుశాల్ మెండిస్ నిలిచాడు. ఇంతకుముందు 2015లో ఇంగ్లండ్‌పై సంగక్కర 70 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు.

**3** వన్డే చరిత్రలో ఒక మ్యాచ్‌లో నాలుగు సెంచరీలు నమోదు కావడం ఇది మూడో సారి. గతంలో పాకిస్థాన్, ఆస్ట్రేలియా (1998).. భారత్, ఆస్ట్రేలియా (2013) మధ్య మ్యాచ్‌ల్లో ఈ రికార్డు నమోదైంది.

## మెండిస్, సమరవిక్రమ అదుర్స్

**టాస్** గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక అందుకు తగ్గట్లు ఆది నుంచే దూకుడు కనబరిచింది. దక్షిణాఫ్రికాతో తొలి మ్యాచ్‌లో కండ్ల ముందు భారీ లక్ష్యమున్నా.. ఎక్కడా వెనుకకు తగ్గకుండా పోరాడిన లంకేయులు..పాక్‌పై అదే జోరు కొనసాగించారు. ఓపెనర్ కుశాల్ పెరెరా(0) మరోమారు నిరాశపరిచినా..పతుమ్ నిస్సంక(51), కుశాల్ మెండిస్(122)..పాక్ బౌలర్లను లక్ష్యంగా చేసుకుంటూ లంకకు శుభారంభాన్ని అందించారు. ముఖ్యంగా మంచి ఫామ్‌మీదున్న మెండిస్..ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అఫ్రిదీ, హసన్ అలీ పవర్‌ఫుల్ పేస్‌ను ఏ మాత్రం లెక్కచేయని మెండిస్.. బౌండరీలతో విరుచుకుపడ్డాడు. నిస్సంక అండతో మరింత సాధికారికంగా ముందుకు సాగాడు. హసన్ బౌలింగ్‌లో నిస్సంక భారీ సిక్స్‌తో బౌండరీ కొట్టగా, మరో సిక్స్‌తో రవూఫ్‌కు స్వాగతం పలికాడు. దీంతో పది ఓవర్లు ముగిసే సరికి శ్రీలంక వికెట్ నష్టానికి 58 పరుగులు చేసింది. 17వ ఓవర్లో నిస్సంక, మెండిస్ ఇద్దరు అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. అయితే మరుసటి ఓవర్లోనే నిస్సంకను ఔట్ చేసిన షాదాబ్ ఖాన్..రెండో వికెట్‌కు 102 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ వేశాడు. ఓవైపు నిస్సంక నిష్క్రమించినా.. సమరవిక్రమతో కలిసి మెండిస్ ఇన్నింగ్స్ కొనసాగించాడు. రవూఫ్ వేసిన ఇన్నింగ్స్ 21వ ఓవర్లో సమరవిక్రమ భారీ సిక్స్ సహా ఫోర్‌తో చెలరేగగా, మెండిస్ మరో సిక్స్‌తో అరుసుకున్నాడు. దీంతో 20 పరుగులు వచ్చి పడ్డాయి. ఇదే జోరులో అఫ్రిదీ బౌలింగ్‌లోనూ హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగిన మెండిస్ 65 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. అయితే ఇదే క్రమంలో కెప్టెన్ బాబర్.. అలీని బౌలింగ్‌కు దింపి ఫలితం రాబట్టాడు. భారీ షాట్ ఆడే క్రమంలో ఇమాముల్ హక్ పట్టిన క్యాచ్‌తో మెండిస్ మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. చరిత అసలంక (1), ధనంజయ డిసిల్వా (25)ఆకట్టుకోలేక పోయారు. ఆఖరి పది ఓవర్లలో పాక్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు.


సమరవిక్రమ (108)

### దవాఖానకు మెండిస్


మెండిస్ (122)

శ్రీలంక వికెట్ కీపర్, బ్యాటర్ కుశాల్ మెండిస్‌ను మ్యాచ్ మధ్యలో దవాఖానకు తరలించారు. కండరాలు పట్టేయడంతో మెండిస్‌కు చికిత్స అందించారు. మెండిస్ స్థానంలో సదీరా కీపర్‌గా వ్యవహరించాడు.

### సంక్షిప్త స్కోర్లు

**శ్రీలంక:** 344/9 (మెండిస్ 122, సమరవిక్రమ 108, అలీ 4/71, రవూఫ్ 2/64), **పాకిస్థాన్:** 48.2 ఓవర్లలో 345/4(రిజ్వాన్ 131 నాటౌట్, షఫీక్ 113, మదుశనక 2/60, తీక్షణ 1/59).

# జోరు సాగనీ..

**నేడు అఫ్గానిస్థాన్‌తో భారత్ ఢీ • మధ్యాహ్నం 2 నుంచి..**

తొలి పోరులో కంగారూలను చిత్తుచేసిన టీమ్ఇండియా.. మలిపోరులో అఫ్గానిస్థాన్‌ను ఢీకొట్టేందుకు రెడీ అయింది. డెంగ్యూ బారిన పడిన శుభ్‌మన్ గిల్ ఈ మ్యాచ్‌కు కూడా అందుబాటులో లేకపోగా.. టాపార్డర్‌పై భారీ అంచనాలున్నాయి!

దక్షిణాఫ్రికా రికార్డు స్కోరు చేసిన పిచ్‌పై రోహిత్ సేన కూడా దుమ్మురేపాలని అభిమానులు ఆశిస్తుంటే.. ఆతిథ్య జట్టుకు కనీస పోటీనివ్వాలని కాబూలీలు భావిస్తున్నారు. స్పిన్‌కు అనుకూలించనున్న పిచ్‌పై బంతిని గింగిరాలు తిప్పేందుకు రషీద్ ఖాన్, నబీ, ముజీబ్ త్రయం రెడీ అవుతుంటే.. సాధికారిక విజయంతో జోరు కొనసాగించాలని టీమ్ఇండియా చూస్తున్నది. మరి పరుగుల వరద పారే ఢిల్లీలో ఎవరిది పైచేయి అవుతుందనేది ఆసక్తికరం!



న్యూఢిల్లీ: పుష్కర కాలం తర్వాత స్వదేశంలో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో టీమ్ఇండియా రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. మొదటి పోరులో ఐదుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియాను మట్టికరిపించిన రోహిత్ సేన బుధవారం అఫ్గానిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. చెన్నై వేదికగా ఆసీస్‌తో జరిగిన పోరులో ఖాతా తెరవకుండానే వెనుదిరిగిన టాప్-3 బ్యాటర్లపై ఈ సారి ఒత్తిడి ఎక్కువగా ఉండటం సహజమే కాగా.. విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ అదే జోష్ కొనసాగించాలని చూస్తున్నారు. చెపాక్ పిచ్ స్పిన్‌కు సహకరిస్తే.. ఢిల్లీ వికెట్ బ్యాటర్లను రా.. రమ్మని ఆహ్వానిస్తున్నది. ఈ మైదానంలో దక్షిణాఫ్రికా, శ్రీలంక మధ్య జరిగిన పోరులో భారీ స్కోర్లు నమోదయ్యాయి. సఫారీ జట్టు నుంచే ముగ్గురు ప్లేయర్లు సెంచరీలు చేస్తే.. ఛేదనలో లంక కూడా మూడొందల పైచిలుకు పరుగులతో ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో మరోసారి భారీ స్కోర్లు ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మెగాటోర్నీకి ముందు భారీ ఆశలు రేపిన యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్.. డెంగ్యూ నుంచి పూర్తిస్థాయిలో కోలుకోకపోవడంతో.. అతడు అందుబాటులో లేకపోగా.. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మతో కలిసి లెఫ్టార్మ్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్ ప్రారంభించనున్నాడు. గత మ్యాచ్‌లో విఫలమైన రోహిత్, ఇషాన్, శ్రేయస్.. ఈసారైనా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాలని టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటున్నది. మరోవైపు ఇటీవలి కాలంలో ప్రమాదకర జట్టుగా ఎదిగిన అఫ్గానిస్థాన్.. కలిసికట్టుగా కదం తొక్కి స్పిన్‌తోనే టీమ్ఇండియాను ఇబ్బంది పెట్టాలని వ్యూహాలు రచిస్తున్నది. కోహ్లీ సొంత మైదానంలో కోహ్లీపై భారీ అంచనాలు ఉన్నాయి. అరుణ్ జైట్లీ స్టేడియంలో విరాట్ కోహ్లీ పేరిట నిర్మించిన స్టాండ్ ఎదురుగా కింగ్ బ్యాటింగ్‌కు దిగనుండగా.. గాయం నుంచి తిరిగి వచ్చాక రాహుల్ మంచి టచ్‌లో కనిపిస్తున్నాడు. గత మ్యాచ్‌లో ఆడిన జట్టుతోనే భారత్ బరిలోకి దిగనుంది. మరో మూడు సిక్సర్లు బాదితే అంతర్జాతీయ క్రికెట్లో అత్యధిక సిక్సలు కొట్టిన ప్లేయర్‌గా చరిత్రకెక్కనున్న రోహిత్ నుంచి అభిమానులు భారీ ఇన్నింగ్స్ ఆశిస్తున్నారు. హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా అటు బౌలింగ్‌లో ఇటు బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. మరోవైపు తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ చేతిలో ఓడిన అఫ్గాన్.. ఈ సారి స్టార్లతో నిండి ఉన్న టీమ్ఇండియాకు షాక్ ఇవ్వాలని చూస్తున్నది. ముఖ్యంగా భారత పిచ్‌లపై అపార అనుభవం ఉన్న మిస్టరీ స్పిన్నర్ రషీద్ ఖాన్ నుంచి రోహిత్‌సేనకు ముప్పు పొంచి ఉంది. ఇక బ్యాటింగ్ విషయానికి వస్తే.. రహ్మానుల్లా, హష్మతుల్లా, ఇబ్రహీం జద్రాన్, మహమ్మద్ నబీ, నజీబుల్లా రూపంలో అఫ్గాన్ జట్టులో ప్రతిభావంతులకు కొదవలేదు. మరి నాణ్యమైన భారత బౌలింగ్‌ను ఎదుర్కొంటూ కాబూలీలు ఏమాత్రం నిలబడగలరో చూడాలి!


రషీద్‌ఖాన్

### పిచ్, వాతావరణం

గత మ్యాచ్‌లో ప్రపంచకప్‌లోనే అత్యధిక స్కోరు నమోదైన పిచ్ కావడంతో ఈ సారి కూడా బ్యాటర్లకు సహకరించనుందనే విశ్లేషణలు ఉన్నాయి. మ్యాచ్‌కు వర్ష సూచన లేదు.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్ (కెప్టెన్), ఇషాన్, కోహ్లీ, శ్రేయస్, రాహుల్, పాండ్యా, జడేజా, అశ్విన్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్.
**అఫ్గానిస్థాన్:** హష్మతుల్లా (కెప్టెన్), రహ్మానుల్లా, ఇబ్రహీం, నబీ, నజీబుల్లా, అజ్మతుల్లా, రషీద్‌ఖాన్, నవీన్, ముజీబ్, ఫజల్‌హక్.



## మేఘనకు పసిడి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: యువ షట్లర్ మేఘన రెడ్డి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సిరీస్‌లో పసిడి పతకంతో మెరిసింది. ఉగాండా వేదికగా జరిగిన టోర్నీలో మెహదీపట్నం సెయింట్ ఆన్స్ కళాశాలకు చెందిన మేఘన సత్తాచాటింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో మేఘన 21-18, 19-21, 21-17తో విక్టోరియా (పోలాండ్)పై విజయం సాధించింది. తొలి గేమ్ సులువుగా గెలుచుకున్న మేఘన రెండో గేమ్‌లో పోరాడి ఓడినా.. మూడో గేమ్‌లో తిరిగి పుంజుకుంది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా కీలక పాయింట్లు సాధిస్తూ విజేతగా నిలిచింది.

# మలన్ విశ్వరూపం

**బంగ్లాపై ఇంగ్లండ్ భారీ విజయం**

ధర్మశాల: వన్డే ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ బోణీ కొట్టింది. గత మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో కంగుతిన్న ఇంగ్లిష్ టీమ్ మంగళవారం బంగ్లాదేశ్‌పై భారీ విజయం సాధించింది. డబుల్ హెడర్‌లో భాగంగా జరిగిన తొలి పోరులో ఇంగ్లండ్ 137 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 364 పరుగులు చేసింది. ఓపెనర్ డేవిడ్ మలన్ (107 బంతుల్లో 140; 16 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీతో విజృంభించగా.. జానీ బెయిర్‌స్టో (52; 8 ఫోర్లు), జో రూట్ (81; 8 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకాలు సాధించారు. ఈ ముగ్గురి దెబ్బకు ఒక దశలో ఇంగ్లిష్ టీమ్ 266/1తో అత్యంత పటిష్ఠ స్థితిలో నిలిచి మరింత భారీ స్కోరు చేసేలా కనిపించినా.. మిడిలార్డర్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. బంగ్లా బౌలర్లలో మెహదీ హసన్ 4, షరీఫుల్ ఇస్లామ్ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లా.. 48.2 ఓవర్లలో 227 పరుగులకు ఆలౌటైంది. లిటన్ దాస్ (76; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), ముష్ఫికర్ రహీమ్ (51) పోరాడినా ఫలితం లేకపోయింది. కెప్టెన్ షకీబ్ (1), తన్జీద్ (1), నజ్ముల్ (0), మెహదీ హసన్ మిరాజ్ (8) విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో టాప్లే 4, వోక్స్ రెండు వికెట్లు పడగొట్టారు. మలన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.


మలన్ (140)

### 'ఇషాన్‌కు అది కొత్త కాదు'

ఢిల్లీ : వరల్డ్ కప్‌లో భారత జట్టు ఓపెనర్ శుభ్‌మన్ గిల్ లేకుండానే రెండో మ్యాచ్‌లో బరిలోకి దిగుతోంది. అయితే.. గిల్ లేని లోటును పూడ్చడంలో ఇషాన్ కిషన్ కీలక పాత్ర పోషిస్తున్నాడని బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోర్ అన్నాడు. జట్టు అవసరార్థం టాపార్డర్ నుంచి మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేయగల సామర్థ్యం ఇషాన్ సొంతమని ప్రశంసలు కురిపించాడు. గతంలో ఇషాన్ ఓపెనర్‌గా ఆడిన అనుభవం ఉంది. కాబట్టి ఆ విషయం గురించి ఇషాన్‌తో ప్రత్యేకంగా మట్లాడాల్సిన అవసరం లేదు. టాపార్డర్ నుంచి మిడిలార్డర్ వరకూ ఎక్కడైనా ఆడగల సమర్థుడు. అంతేకాదు ఇషాన్ మ్యాచ్ గమనాన్ని బాగా అర్థం చేసుకోగలడు. అతడు వరల్డ్ కప్ జట్టులో ఉండడానికి ప్రధాన కారణం అదే. రేపు అతను భారీ స్కోర్ చేయాలని కోరుకుంటున్నా అని విక్రమ్ పేర్కొన్నాడు. ఆస్ట్రేలియాతో చెన్నైలో జరిగిన తొలి మ్యాచ్‌లో ఇషాన్ నిరాశపరిచాడు. ఎదుర్కొన్న మొదటి బంతికే వికెట్ ఇచ్చేశాడు.

# పవన్‌కు రికార్డు ధర

- 2.6 కోట్లు పెట్టిన తెలుగు టైటాన్స్
- గుజరాత్ గూటికి ఫజల్
- ప్రొ కబడ్డీ లీగ్ వేలం

ముంబై: మట్టి నుంచి మ్యాట్‌పైకి తెచ్చి.. గ్రామీణ క్రీడకు దేశవ్యాప్తంగా మరింత క్రేజ్ తీసుకొచ్చిన ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) వేలంలో నయా రికార్డులు నమోదయ్యాయి. 10వ సీజన్ కోసం జరిగిన వేలంలో భారత జట్టు కెప్టెన్ పవన్ షెరావత్ రికార్డు ధర పలికాడు. ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో భారత జట్టు స్వర్ణం నెగ్గడంలో కీలక పాత్ర పోషించిన పవన్ కోసం ఫ్రాంచైజీలు పోటీ పడగా.. తెలుగు టైటాన్స్ జట్టు రూ. 2.6 కోట్లకు సొంతం చేసుకుంది. దీంతో పీకేఎల్ చరిత్రలో అత్యంత ధర పలికిన ఆటగాడిగా పవన్ చరిత్రకెక్కాడు. ముంబైలో రెండు రోజుల పాటు జరిగిన వేలం ప్రక్రియలో మంగళవారం సీ, డీ కేటగిరీ ఆటగాళ్ల వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఇరాన్‌కు చెందిన మొహమ్మద్ రెజా రూ.2.35 కోట్లతో రెండో ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. యువ రైడర్ మన్‌దీప్ సింగ్‌ను రూ. 2.12 కోట్లతో బెంగాల్ వారియర్స్ సొంతం చేసుకోగా.. ఉడుం పట్టుతో ప్రత్యర్థులను హడలెత్తించే స్టార్ డిఫెండర్ ఫజల్ అత్రాచలిని రూ.1.65 కోట్లకు గుజరాత్ జెయింట్స్ దక్కించుకుంది. బాహుబలి సిద్దార్థ్ దేశాయ్ కోటి రూపాయలకు హర్యానా స్టీలర్స్ కొన్నది.



### పాక్‌తో పోరుకు గిల్ అనుమానమే!

న్యూఢిల్లీ: భారత యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్.. ప్రపంచకప్‌లో దాయాది పాకిస్థాన్ పోరుకు కూడా అందుబాటులో ఉండే అవకాశాలు కనిపించడం లేదు. ఆస్ట్రేలియాతో తొలి పోరు కు ముందు అస్వస్థతకు గురైన గిల్.. అఫ్గానిస్థాన్‌తో బుధవారం జరగనున్న మ్యాచ్‌కు కూడా దూరమయ్యాడు. అఫ్గాన్‌తో పోరు కోసం టీమ్ఇండియా ఢిల్లీ చేరిపోగా.. గిల్ మాత్రం చెన్నైలో ఉండిపోయాడు. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడంతో స్థానిక దవాఖానాలో చేరాడు. ఈ నెల 14న అహ్మదాబాద్ వేదికగా.. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరుగనున్న మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉండడం అనుమానంగా మారింది.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.